

విద్యారుణాల్లో రాష్ట్రం ముందంజ

బెంగళూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఉన్నత విద్యారుణాలకు సంబంధించి కర్ణాటక దేశంలోనే రెండోస్థానంలో ఉందని ఒక నివేదిక వెల్లడించింది. ఐదేళ్లలో రాష్ట్రంలో విద్యారుణాలకు సంబంధించి అర్జీలు సమర్పించిన మహిళల్లో 30.7శాతం ప్రగతి ఉందన్నారు. సాంకేతిక విద్య, వృత్తిపర విద్యలకు సంబంధించి ఇటీవల ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఇందుకు సంబంధించిన నివేదిక గురువారం విడుదలైంది. బెంగళూరు తర్వాత మైసూరు, బెళగావి, ధారవాడ వంటి ద్వితీయశ్రేణి నగరాల్లో సైతం మహిళలు రుణాలు అధికంగా పొందారని నివేదికలో పేర్కొన్నారు.



జీవిత కాలం.. రాజకీయాల్లోనే..!

- ప్రత్యక్ష రాజకీయాలను వీడే ఆలోచన లేదు
- అభిమానులు, మద్దతుదారుల ఒత్తిడితోనే నిర్ణయం
- సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యలు
- నీడను కూడా నమ్మలేం.. మంచి రోజులు రానున్నాయి : డీసీఎం డీకే శివకుమార్


బెంగళూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జీవితాంతం రాజకీయాల్లోనే ఉంటానని, ప్రత్యక్ష రాజకీయాలను వీడేది లేదని సీఎం సిద్దరామయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షుల మార్పు అంశం హల్‌చల్ చేస్తోంది. ఓవైపు పీసీసీ అధ్యక్షుడి మార్పు చేయాలని సీనియర్ నేతలు కొందరు ప్రతిపాదిస్తున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తాజాగా వివిధ రాష్ట్రాల అధ్యక్షులను మార్పు చేస్తున్నామని ప్రకటించారు. ఇందులో కర్ణాటక కూడా ఉండనుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా సాగుతుండగానే సీఎం సిద్దరామయ్య సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు. గడిచిన శాసనసభ ఎన్నికల వేళ ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని ప్రకటించారు. అయితే క్రియాశీలకంగానే ఉంటానని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఓ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్‌బై చెప్పాలని భావించానని అయితే అభిమానులు, మద్దతుదారులు ఒత్తిడి మేరకు రాజకీయాల్లో కొనసాగాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలమధ్యన ఉండడమే తనకు ఇష్టమన్నారు. దీన్నిబట్టి ప్రత్యక్షరాజకీయాలకు దూరంగా వెళ్లేది లేదని పరోక్షంగా ప్రకటించినట్లయింది. రాష్ట్రంలో పేరొందిన ముఖ్యమంత్రిగా దేవరాజ్ అరసు నిలిచారు. ఆయన 7 సంవత్సరాల 7 నెలలపాటు సీఎంగా కొనసాగారు. ఆ రికార్డును సిద్దరామయ్య అధిగమించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే తొలి విడతలో ఐదేళ్లు, రెండో విడతలో మే నెల నాటికి రెండేళ్లు పూర్తి కానుంది. ఆ తర్వాతకూడా ఆయన సీఎంగా కొనసాగాలని ఆలోచిస్తున్నారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై అధిష్ఠానం వద్ద ఒప్పందం కుదిరిందని, తొలి రెండేళ్లు లేదా రెండున్నరేళ్ల తర్వాత మార్పు ఉంటుందని పార్టీ వర్గాల్లో చర్చలు జరిగాయి. రెండో విడతలో డీకే శివకకుమార్ సీఎం అవుతారని అందరూ భావించారు. 2023 శాసనసభ ఎన్నికల్లో ముఖ్యమంత్రి పేరు ప్రకటించే విషయంలో సుమారు వారం రోజులపాటు ఉత్కంఠ నెలకొంది. చివరకు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ జోక్యం చేసుకోవడంతో సమస్య పరిష్కారమయ్యింది.

మార్పుపై జోరుగా ఊహాగానాలు

నాయకత్వ మార్పుపై ఎటువంటి ఒప్పందం జరిగిందనేది ఎవరికీ తెలియని అంశంగా ఉంది. రెండేళ్లు పూర్తి అవుతున్న తరుణంలో మరోసారి నాయకత్వ మార్పు అంశం తెరపైకి వచ్చింది. అందులో భాగంగానే ఇటీవల మంత్రులు సతీశ్‌జార్కిహొళి, పరమేశ్వర్, మహదేవప్ప, రాజణ్ణలు ఒకటిరెండుసార్లు రహస్యభేటీలు కావడం, ఢిల్లీకి వెళ్లి వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా రెండురోజులక్రితం ఢిల్లీ వెళ్లిన సతీశ్‌జార్కిహొళి అధిష్ఠానం పెద్దలతో చర్చలు జరిపారు. పార్టీ అధ్యక్షుడిగా తొలి విడత పూర్తి అయిన మేరకు మార్పు చేయాలని ప్రస్తావించారు. అధిష్ఠానం పెద్దలు ఎటువంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారనేది రహస్యంగా ఉంది. ప్రస్తుతం కేపీసీసీ అధ్యక్షుడి ప్రతిపాదన చేస్తున్నవారంతా సిద్దరామయ్యకు ఆప్తులనేది తెలిసిందే. పలువురు మంత్రులు సిద్దరామయ్య ఐదేళ్లపాటు కొనసాగాలని వ్యాఖ్యానిస్తున్నారు. అందులో మంత్రులు రాజణ్ణ, సతీశ్‌జార్కిహొళి, ఎంబీ పాటిల్‌తోపాటు పలువురు ఉన్నారు. ఇదే అంశంపై మరోసారి ప్రస్తావన రాగా తాజాగా హోం మంత్రి పరమేశ్వర్ కూడా గురువారం ఇటువంటి వ్యాఖ్యలు చేశారు. సిద్దరామయ్య పూర్తికాలం సీఎంగా కొనసాగాలన్నారు. దీన్నిబట్టి సిద్దరామయ్యను బలపరిచేవారు పెరుగుతున్నారు. కానీ ఆ స్థాయిలో డీకే శివకుమార్‌కు బహిరంగంగా వ్యాఖ్యానించేవారు లేరు. తాజాగా ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతాననే సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యలపై డీసీఎం స్పందించారు. పార్టీలో నిష్ఠావంతులకు మంచి రోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక్కోసారి మననీడను కూడా నమ్మలేమన్నారు. దీన్నిబట్టి ఆయన ఆలోచనలు ఏ విధంగా ఉన్నాయనేది తెలిసిందే.

అధ్యక్షుడే కాదు.. సుర్జేవాలాను మార్చాలి..

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవికి డీకే శివకుమార్‌ను మార్పు చేయాలనే డిమాండ్‌తోపాటు ఆయనకు సన్నిహితంగా ఉండడంతోపాటు సంపూర్ణంగా సహకరిస్తున్నారని రాష్ట్రపార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాను మార్పు చేయాలనే డిమాండ్ ఉంది. రాష్ట్రానికే చెందిన మల్లికార్జున ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతుండడంతో సుదీర్ఘకాలంగా ఆయనతో సన్నిహిత సంబంధాలు కల్గిన పార్టీ సీనియర్ నేతలు తరచూ ఢిల్లీ వెళ్లి భేటీ అవుతున్నారు. ఇదే సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తున్నారు. ప్రధానంగా అధ్యక్షుడి మార్పు కోసం పలువురు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. డీకే శివకుమార్ ప్రస్తుతం డీసీఎం, బెంగళూరు నగరాభివృద్ధిశాఖ, జలవనరులశాఖ మంత్రితోపాటు కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఒకే వ్యక్తికి ఇన్ని కీలకమైన పదవులు సమంజసమేనా అనేది పలువురి అభిప్రాయంగా ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ అధ్యక్ష పదవిని బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. పనిలో పనిగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడితోపాటు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాను మార్పు చేయాలనే డిమాండ్‌ను ప్రస్తావిస్తున్నారు. రణదీప్‌సింగ్ సుర్జేవాలా నేతృత్వంలో 2023 శాసనసభ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికలు కొనసాగాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్నా ఇన్‌చార్జ్ బాధ్యతలను తొలగించాలని రెండు నెలలక్రితమే సుర్జేవాలా అధిష్ఠానాన్ని కోరినట్లు తెలుస్తోంది. ఎంతవరకు వాస్తవమో తెలియదుగానీ రాష్ట్ర పార్టీ నేతలు మాత్రం మార్పుకు ప్రతిపాదిస్తున్నారు. సుర్జేవాలా హర్యానా ఇన్‌చార్జ్ పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ నాయకుడు ఇన్‌చార్జ్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నందున ఇన్‌చార్జ్ పదవులకోసం పలు రాష్ట్రాల నేతలు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా కేసీ వేణుగోపాల్ కొనసాగిన విషయం తెలిసిం దే. రాహుల్‌గాంధీ ఆప్తులలో ఒకడిగా ఉన్న కేసీ వేణుగోపాల్ జాతీయస్థాయిలో క్రియాశీలకంగా ఉండాలని, పార్టీ ఇన్‌చార్జ్ పదవి నుంచి సుర్జేవాలాకు అప్పగించారు. ప్రస్తుతంఆయనను మార్పు చేస్తే ఎవరు ఇన్‌చార్జ్ అవుతారనేది కుతూహలం అవుతోంది. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఎటువంటి విబేధాలు లేవని అంతా కలిసే ఉన్నామని గ్రూపు రాజకీయాలకు అవకాశం లేదని చెప్పుకొంటున్నా నిరంతరంగా ఎవరికివారు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.



లవ్ షో..!

- ఎయిర్ షోలో ఆకట్టుకున్న ప్రేమ చిహ్నం
- అలరించిన విహంగాల విన్యాసాలు

బెంగళూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వాలెంటైన్స్ డేకు ఒకరోజు ముందే ప్రేమికులు పులకించిపోయారు. ఏరో ఇండియా 2025 వైమానిక ప్రదర్శనలో నాల్గో రోజు యుద్ధ విమానాలు అబ్బురపరిచాయి. ముఖ్యంగా ఆకాశంలో విహంగాలతో రూపు దిద్దుకున్న ప్రేమ చిహ్నం విశేషంగా ఆకట్టుకుంది. సాధారణ ప్రజలు టిక్కెట్ కొనుగోలు చేసే వీక్షించే అవకాశం ఉండడంతో పెద్దసంఖ్యలో గురువారం తరలివచ్చారు. యలహంక ఎయిర్‌బేస్ ప్రాంతం సందర్శకులతో జనసందడి కనిపించింది. మండుటెండలను సైతం లెక్క చేయకుండా ప్రజలు లోహవిహంగాల విన్యాసాలను చేసి విశేష అనుభూతి పొందారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామీజీ కూడా సందర్శించారు. బెంగళూరు ఎంపీ తేజస్వి సూర్య హెచ్‌టీటీ 40 ఎయిర్‌క్రాఫ్ట్‌లో చక్కర్లు కొట్టారు.



ఎయిర్ షోలో చిన్నారుల ఉత్సాహం

జాతీయ పతాకంతో..



సందర్శకుల సందడి



అద్భుతాలను ఫోన్‌లో బంధిస్తూ..

లవ్ సింబల్ వద్ద ప్రేమికుల ఆనందం..

మెట్రో చార్జీల తగ్గింపు

- సీఎం ఆదేశాలతో దిగొచ్చిన బీఎంఆర్‌సీఎల్



బెంగళూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నమ్మ మెట్రో చార్జీలు పెంపుకు నిరసనగా ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ పార్టీల నేతలతో పాటు ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించారు. కన్నడసంఘాలతో పాటు ప్రజాసంఘాలు, ఐటీ ఉద్యోగులు ప్రభుత్వ తీరును ఖండించారు. దీనికి తోడు వారం రోజులుగా మెట్రోలో ప్రయాణీకుల సంఖ్య తగ్గుముఖం పట్టినట్లు ప్రచారం జరిగింది. వీటన్నింటి పరిణామాల నేపథ్యంలో సీఎం సిద్దరామయ్య స్పందించారు. మెట్రో చార్జీలు తగ్గించాలని బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీకు సూచించినట్లు గురువారం ప్రకటించారు. ఆలోగానే స్పందించిన బీఎంఆర్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్వరరావ్ మీడియాతో మాట్లాడుతూ.. మెట్రో చార్జీలు 90-100శాతం ఉండే స్టేషన్‌ల మధ్య తగ్గిస్తున్నట్లు తెలిపారు. 60శాతం స్లాబ్‌లో మెర్జ్ చేస్తామన్నారు. తగ్గించిన ఛార్జీలు శుక్రవారం నుంచే అమలులోకి వస్తాయన్నారు. కనీస చార్జీ పది రూపాయల నుంచి గరిష్ఠంగా రూ.90గా ఉంటుందని అందులో మార్పులు ఉండవన్నారు.



28 నుంచి హంపి ఉత్సవాలు 8

JEE (Mains) 2025
ಪ್ರತಿಬಾರಿ ಪ್ರತಿವರ್ಷ ಪ್ರಥಮ
ಸತತವಾಗಿ ಜೆಇಇ ಪರೀಕ್ಷೆಯಲ್ಲಿ ಅತ್ಯಂತ ಶ್ರೇಷ್ಠ ಪರ್ಸೆಂಟೈಲ್ ಪಡೆವ ಮಧ್ಯ ಕರ್ನಾಟಕದ ಏಕೈಕ ವಿದ್ಯಾ ಸಂಸ್ಥೆ ಸರ್ ಎಂ ವಿ
15 YEARS OF EXCELLENCE
DIST. 1 FIRST 99.73 VINAY KORI
99.66 PRATHAM G. | 99.49 AARYA K. B. | 99.47 PRATHEEK | 99.32 JAYADEVA | 99.29 GURURAJ | 99.26 YASHAS. S. | 99.06 CHANDAN | 99.05 PRADYOTH | 98.98 JEEVAN B. J. | 98.98 YOGESHWARA
98.86 NANDAN | 98.83 ADITHI V. A. | 98.79 UTHSAV M. R. | 98.75 ANMOL S. | 98.71 KEERTANRAJ | 98.71 ABHISHEK | 98.71 GANAVI H. K. | 98.70 ABHISHEK C. | 98.55 RAHUL R. M. | 98.55 PRAJWAL
98.50 ALYA F. H. | 98.49 PRANAMYA | 98.46 VISHAL K. M. | 98.44 SRUSTI K. | 98.42 ADITHI | 98.40 SHRUSTI SING | 98.39 VITTAL REDDY | 98.28 BHOOMIKA L. | 98.27 AKSHITH R. | 98.20 AMOGH C. P. | 98.17 VAISHNAVI | 98.12 SHIREESH D. | 98.11 SHREESHA | 98.10 ABHISHEK H. | 98.06 ANANYA A.M.
98.04 NUTHANA V. | 98.00 VINAY KUMAR | 98.00 ARHAN A. | 98.00 RAKSHA B. | 97.98 SINCHANA
97.96 NANDANA A. | 97.96 JYESHTA T. R. | 97.91 JAYALAXMI | 97.84 ANANYA R.
And Many More...
99 Percentile & above 9 Students
98 Percentile & above 39 Students
97 Percentile & above 64 Students
96 Percentile & above 91 Students
95 Percentile & above 113 Students
90 Percentile & above 240 Students
Subject wise highest percentile: Chemistry 99.97, Physics 99.95, Maths 99.83
SIR M V GROUP OF INSTITUTIONS
DAVANGERE 08192-261200, 9243312223, 8722141400
SHIMOGA 9035141142, 8088350265, 7411084349
BALLARI 8197764018, 9945377965

వైసీపీ పాపం..!

• పాల సేకరణ కేంద్రం మూత • పాడి రైతులకు అందని బకాయిలు



గత వైసీపీ పాలకుల పాపం.. పాడి రైతులకు శాపంగా మారింది. పట్టణ పరిధిలోని పాల సేకరణ కేంద్రాన్ని ఉన్నఫలంగా మూత వేయడంతో పాడి రైతులకు బకాయిలు అందకుండా పోయాయి. ఏకంగా రూ.17 లక్షలు చెల్లించాల్సి ఉందని పాడి రైతులు వాపోతున్నారు. ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామంటూ వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా చెల్లించి, ఆదుకోవాలని కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, రాయదుర్గం రూరల్

మూతపడిన పాల సేకరణ కేంద్రం

టీడీపీ హయాంలో ఏర్పాటు

వ్యవసాయంలో నష్టాలు రావడంతో చాలా మంది రైతులు ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమ వైపు మొగ్గారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పాడి రైతులకు బాసటగా నిలవాలని రాయదుర్గంలో పాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించింది. రాయదుర్గం మండలంలోని డీ కొండాపురం, బీఎన్‌హళ్లి, బొమ్మక్కపల్లి, వడ్రవన్నూరు, రేకులకుంట, రాయంపల్లి, గుమ్మఘట్ట మండలంలోని గలగల, గొల్లపల్లి, కలుగోడు, బేలోడు, నేత్రపల్లి, డీ.హీరేహాళ్ మండలంలోని గొడిశలపల్లి, హనుమాపురం, ఎస్ఆర్ కోట గ్రామాల నుంచి పాలను సేకరిస్తుండేవారు. 100 లీటర్లతో ప్రారంభమైన పాల సేకరణ కేంద్రం.. మూడు వేల లీటర్ల స్థాయికి చేరింది. రైతుల నుంచి పాలను సేకరిస్తూ ఎప్పటికప్పుడు బిల్లులు కూడా చెల్లిస్తూ ఉండేది. తద్వారా రైతులు లాభాలు గడిస్తుండేవారు.

వైసీపీ రాకతో మూత

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పాల సేకరణ కేంద్రానికి గడ్డుకాలం మొదలైంది. డెయిరీని ప్రైవేటు పరం చేయడంతో 2020లో ఏకంగా మూత వేశారు. దీంతో పాడి రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రైవేటు డెయిరీలకు పాలను అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డెయిరీలు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పాల సేకరణ కేంద్రం మూత వేసేనాటికి నియోజకవర్గంలో 210 మంది రైతులకు రూ.17 లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. బిల్లుల కోసం పాడి రైతులు.. వెలుగు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. బకాయి బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన గత వైసీపీ పాలకులు.. ఆ తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదు.

తుప్పుపట్టిన పరికరాలు

పాల సేకరణ కేంద్రాన్ని మూత వేయడంతో అందులోని పరికరాలు తుప్పు పడుతున్నాయి. కాలర్ కంప్రైజర్ యంత్రాలు, ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. సామగ్రి తుప్పు పట్టింది. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయింది.

రూ.లక్ష బకాయిలు రావాలి



గతంలో డెయిరీకి పాలను విక్రయించేవాడిని. బిల్లు రూ.లక్షదాకా రావాల్సి ఉంది. డెయిరీ మూతతో ప్రైవేటు డెయిరీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ధరలు, డిమాండ్‌ను బట్టి మారుతుంటాయి. విధి లేని పరిస్థితిల్లో వారు చెల్లించిన బిల్లులను తీసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వ పాలకేంద్రం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.

-తిమ్మరాజు, పాడి రైతు, బీఎన్ హళ్లి

పాల కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి



టీడీపీ పాలనలో ప్రభుత్వమే డెయిరీలను ప్రారంభించి, రైతుల నుంచి పాలను సేకరించేది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాల సేకరణ కేంద్రాన్ని మూత వేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాల బిల్లుల కోసం రైతులు.. కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయారు. కూటమి ప్రభుత్వమైనా పాడి రైతుల కష్టాలను గమనించి, పాల కేంద్రాలను ప్రారంభించాలి.

-తిప్పేస్వామి, రైతు కూలీ సంఘం నియోజకవర్గ కార్యదర్శి

అరణ్యం.. కాపాడుకోవడమే శరణ్యం

ప్రత్యేక కార్యాచరణ
తరచూ అటవీ ప్రాంతంలోకి వెళ్లేవారి వివరాల నమోదు
ఏటా మంటలు చెలరేగే ప్రాంతాల గుర్తింపు
నివారణ చర్యలపై స్థానికులకు అవగాహన
కంట్రోల్ బర్నింగ్ ద్వారా నష్ట నివారణ



మంటలను అదుపు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది (ఫైల్)

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ముందుగానే కరువు జిల్లా. వర్షపాతం తక్కువ. పచ్చని పైర్లు కనిపించేదీ అరుదు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు ఉన్న మార్గం అడవులు. అటవీ ప్రాంతాన్ని కాపాడుకుంటేనే మనుగడ సాధ్యమన్నది నిర్వివాదాంశం. వేసవి ప్రారంభమవడంతో అడవులకు అగ్ని ప్రమాదాల ముప్పు పొంచి ఉంది. మండే ఎండలకు మంటలు చెలరేగే అవకాశం ఉంది. అదే జరిగితే పచ్చని చెట్లు అగ్నికి ఆహుతవడంతో వన్యప్రాణాలు మాడి మసైపోతాయి. ఈ నేపథ్యంలో అగ్ని నుంచి అడవిని కాపాడటం అటవీశాఖ సిబ్బందికి సవాల్‌గా మారింది. ఏడాదిపాటు కాపాడిన అడవి వేసవిలో రాత్రికి రాత్రే మాడి మసైపోతుంది. అగ్ని నుంచి అడవుల పరిరక్షణకు

నూతన చర్యలు

అడవిలో అగ్ని ప్రమాదాల నివారణకు గ్రామస్థాయిలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించి, ఏ సమయంలో అడవిలో అగ్గిపడినా సహకారం అందించేలా వారికి బాధ్యతలు అప్పగిస్తున్నారు. గ్రామాల నుంచి ఏ దారి వెంబడి స్థానికులు అడవిలోకి వెళ్తున్నారు, తిరిగి ఎలా వస్తున్నారన్న వివరాలను అటవీశాఖ సిబ్బంది ద్వారా నమోదు చేయిస్తున్నారు. సమీప ప్రదేశాల్లో మంటలు చెలరేగితే అడవిలోకి వెళ్లే స్థానికులను కూడా బాధ్యులను చేస్తూ అదుపు చేసేలా తగిన చర్యలు చేపడుతున్నారు. మంటలు ఎలా పడ్డాయన్న దానిపై రిజిస్టర్‌లో నమోదు చేసిన వారిని పిలిపించి, విచారణ చేయనున్నారు. ఇందులో వారి తప్పు ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు చేపట్టి, కటకటాల పాలు చేయనున్నారు. ఈ చర్యల ద్వారా అగ్ని నుంచి అడవిని కొంతవరకైనా కాపాడుకునే వెసులుబాటు ఉంటుందని డీఎఫ్ఓ చెప్పుకొస్తున్నారు.

జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) విఘ్నేష్ నూతన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఆ దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. జిల్లాలో ఏటా అగ్ని ఎక్కడెక్కడ పడుతుంది, ఫైర్ వాల్స్ ఎక్కడన్నది సిబ్బంది ద్వారా గుర్తించి, రికార్డులు తయారు చేయించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టి మంటలను అదుపు చేయాలని భావిస్తునానరు. మంటలు వ్యాపించకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

మంటల అదుపునకు..

అడవిలో మంటలు ఏర్పడితే వాటిని అదుపు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఏటా మంటలు చెలరేగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ఆ ప్రదేశంలో మళ్లీ అగ్గి పడినా పక్క ప్రాంతాలకు పాకకుండా కంట్రోల్ చేసేలా శుభ్రం చేయిస్తునానరు. మరి ఎంతవరకు ఫలితాలు సాధిస్తారన్నది తెలియాలంటే వేచిచూడాల్సిందే..

ప్రత్యేక చర్యలతో అడవిని కాపాడుతాం



కంట్రోల్ బర్నింగ్ విధానం ద్వారా అగ్ని నుంచి అడవిని కాపాడవచ్చు. అందుకు అనుగుణంగా జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఫైర్ వాల్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తిస్తున్నాం. అక్కడ కంట్రోల్ బర్నింగ్‌కు తగిన చర్యలు చేపట్టి, పక్క ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటాం.

- విఘ్నేశ్, జిల్లా అటవీ శాఖాధికారి

పాత సరుకు.. కొత్త ధరకు..

మద్యం షాపుల్లో అదనపు వసూళ్లు
పాత స్టాక్ పెంచిన రేట్లతో విక్రయాలు
మందుబాబుల జేబులకు చిల్లు
కనిపించని ధరల పట్టిక
కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు



మద్యం షాపు వద్ద కనిపించని కొత్త ధరల పట్టిక

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మద్యం ధరల పెంపును పలు షాపుల నిర్వాహకులు అడ్డాదిడ్డంగా సొమ్ము చేసుకుంటున్నారు. అదనపు వసూళ్లకు దిగుతున్నారు. క్వార్టర్‌తోపాటు హాఫ్, ఫుల్ బాటిళ్ల ధరలను రూ.10 చొప్పున ప్రభుత్వం పెంచింది. రూ.99 రకం మద్యం బాటిల్, బీర్ల ధరలను యథాతథంగా ఉంచింది. ఇదివరకే మద్యం దుకాణదారులు కొనుగోలు చేసిన మద్యాన్ని పాత ధరకే విక్రయించాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా జిల్లాలోని కొన్ని మద్యం దుకాణాల్లో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. నిబంధనల మేరకు మద్యం ధర పెరిగినరోజే కొత్త మద్యం ధరల పట్టికను మద్యం షాపుల వద్ద ప్రదర్శించాలి. ఎక్కడా అవి కనిపించకపోవడం గమనార్హం.

పెంచిన ధరలతో విక్రయాలు

జిల్లాలో 136 ప్రైవేటు మద్యం దుకాణాలున్నాయి. 19 బార్ అండ్ రెస్టారెంట్లున్నాయి. మూడు రోజులుగా జిల్లాలోని అన్ని మద్యం దుకాణాల్లో పాత స్టాక్‌ను కొత్త ధరలకు విక్రయిస్తున్నారు. నిబంధనల మేరకు ఐఎంఎల్ డిపో నుంచి ఇదివరకు పాత ధరలకు కొనుగోలు చేసిన మద్యాన్ని అవే రేట్లతో విక్రయించాల్సి ఉంది. మద్యం దుకాణాల్లో పాత సరుకునే పెంచిన ధరతోనే విక్రయిస్తుండటం గమనార్హం. క్వార్టర్‌తోపాటు హాఫ్, ఫుల్ బాటిళ్లపై రూ.10 చొప్పున పెంచారు. అనంతపురం నగరంతోపాటు జిల్లాలోని ఇతర మండలాల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ.10 లెక్కను చూపుతూ హాఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.30 అదనంగా వసూలు చేస్తుండడం గమనార్హం. అనంతపురం నగర శివారులోని దుకాణాలు, పలు సర్కిళ్లలో రూ.99 మద్యం బాటిల్‌ను రూ.110కి విక్రయించడం విశేషం. వాస్తవానికి రూ.99 మద్యం బాటిల్ ధరను ప్రభుత్వం పెంచలేదు. అయినా అన్ని రకాల బ్రాండ్ల మద్యం ధరలు పెంచారంటూ ఆ రకంపైనా అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. పలు మండల కేంద్రాల్లో బీర్లపైనా అదనంగా రూ.20 వసూలు చేస్తున్నట్లు సమాచారం.

అదనంగా వసూలు చేస్తే చర్యలు

ప్రభుత్వం క్వార్టర్, హాఫ్, ఫుల్ బాటిళ్లపై రూ.10 చొప్పున పెంచింది. బీర్లు, రూ.99 రకం మద్యం బాటిల్ ధరలు పెంచలేదు. ఇదివరకే మద్యం దుకాణదారులు కొనుగోలు చేసిన పాత సరుకును అదే ధరకే విక్రయించాలి. ధరలు పెంచిన తర్వాత ఐఎంఎల్ డిపో నుంచి కొనుగోలు చేసిన మద్యం బాటిళ్లను మాత్రమే పెంచిన ధరకు విక్రయించాలి. అన్ని షాపుల వద్ద బ్రాండ్ల వారీగా పెంచిన ధరలు ప్రదర్శించాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఎమ్మార్పీపై అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం.

-రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

కన్నెత్తి చూడని ఎక్సైజ్ యంత్రాంగం

మద్యం షాపుల్లో నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం తప్ప.. క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. మద్యం ధరలు పెరిగిన నేపథ్యంలో ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఆ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పాత సరుకును కొత్త ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్వార్టర్, హాఫ్, ఫుల్ బాటిళ్లపై రూ.10 చొప్పున మాత్రమే ప్రభుత్వం పెంచిందనీ, ఆ మేరకు కొత్త ధరలు అమలయ్యేలా చూడాలన్నారు. అన్ని మద్యం దుకాణాల్లో ధరల పట్టికను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజులుగా నిబంధనలు అతిక్రమించి అదనపు ధరలకు మద్యం విక్రయిస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసిన పాపాన పోలేదు.

జిల్లాకు పతకాల పంట

రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ అనంత

జట్టుకు ఘన సత్కారం



రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన జిల్లా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట పండింది. రాజధాని అమరావతి సమీపంలోని మంగళగిరి స్టేడియంలో నాలుగు రోజుల క్రితం నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2025కు 13 ఉమ్మడి జిల్లాల పారా అథ్లెట్లు ప్రాతినిథ్యం వహించారు. ఇందులో జిల్లా అథ్లెట్లు అత్యధికంగా 43 పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. వాటిలో 20 బంగారు, 19 రజత, 11 కాంస్య పతకాలున్నాయి. విజేతలను గురువారం స్థానిక అశోక్ నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్‌కుమార్, మీనాక్షమ్మ ఫౌండేషన్ రవికాంత్ రమణ పతకాలు, సర్టిఫికెట్లు, టీ షర్టులు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాయిసంస్థ విజయసాయి కుమార్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఆరుగురి ఎంపిక



సాకే బాబు, సహన, అల్లావలి, వెంకటేష్, పల్లవి, సంజయ్‌రెడ్డి

చెన్నైలో ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించే జాతీయస్థాయి పారా అథ్లెటిక్ పోటీలకు జిల్లా నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. వారిలో సాకే బాబు, సహన, అల్లావలి, వెంకటేష్, పల్లవి, సంజయ్‌రెడ్డి ఉన్నారు. వారిని పలువురు అభినందించారు.

జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం కార్యకవర్గం ఎన్నిక



నూతన జిల్లా కమిటీ సభ్యులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. మండలంలోని రాచానపల్లిలోని యేసుకృపా మందిరంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పాస్టర్ నెహెమ్యా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ మార్కు, కార్యదర్శిగా ఆనంద్, సహాయ కార్యదర్శిగా మనషే, కోశాధికారిగా జీవన్‌బాబు, ఈసీ మెంబర్లుగా జహంగీర్ జాషువా, లాబాన్ సుధాకర్, విజయ్‌సింహ, చార్లెస్ నాయక్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో షాలేమ్ రాజు, బండెల రాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం

మంత్రి సత్యకుమార్ యాదవ్



దివ్యాంగుడి సమస్యను వింటున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

తాడిమర్రి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని మరువపల్లిలో గురువారం 87 మంది రైతులకు మంతిర ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీకి సంబంధించి ఉత్తర్వులు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకుని, గృహ అవసరాలను విద్యుత్‌ను తయారు చేసుకోవచ్చన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద రైతులు పొలాల్లో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుని వ్యవసాయ మోటార్లకు కూడా విద్యుత్‌ను తయారు చేసుకోవచ్చన్నారు. ఆ తరువాత శివంపల్లిలో కోకో కోలా కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంటు, ఆర్వో ఏటీఎంను మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో జల్‌జీవన్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు అలాగే ఉండిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పని ప్రారంభించిందన్నారు. ప్రతిఇంటికి కొళాయి ఏర్పాటుచేసి, తాగునీరు అందిస్తామన్నారు. గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ కూచి రాము, నాయకులు పాల్గొన్నారు

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయండి

అధికారులకు మంత్రి సవిత ఆదేశం



అధికారులతో సమావేశమైన మంత్రి

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గురువారం నియోజకవర్గస్థాయి అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. కూటమి పాలనలో ఇచ్చిన వాటితో పాటు ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తున్నామన్నారు. వాటిని ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

రాయల జయంతికి ఆహ్వానం

ఈనెల 16న పెనుకొండలో నిర్వహించే శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవానికి రావాలని మంత్రి సవితకు బలిజ సంఘం ప్రతినిధులు ఆహ్వానపత్రికను అందించారు. అనంతరం ఆగస్టులో ప్రభుత్వం తరఫున కృష్ణదేవరాయల పట్టాభిషేక ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గుట్టూరు సూరి, పూల శీనా, కల్యాణ్ పాల్గొన్నారు.

మత్స్యకార లైసెన్స్ ఇవ్వాలి

గొల్లపల్లి రిజర్వాయర్‌పై లైసెన్స్ సిస్టం ఏర్పాటుచేసి, తమకు లైసెన్స్ మంజూరు చేయాలని మంత్రి సవితను గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ మత్స్యకారులు కోరారు. వారు మాట్లాడుతూ.. గొల్లపల్లి రిజర్వాయర్‌కు తమ పొలాలు తీసుకున్నారన్నారు. అప్పట్లో పరిహారం తక్కువగా ఇచ్చారన్నారు. చేపలవేటే తమకు జీవనాధారమనీ, లైసెన్స్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, నాగరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిల్లల్లారా.. పిడుగుల్లారా.. రారండోయ్..

నేటి నుంచి పిల్లల పండుగ.. అనంత బాలోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పిల్లలు చేసే అల్లరి, డ్యాన్సులు, కళా ప్రదర్శనలు.. అవన్నీ కళ్లారా చూస్తేనే.. తనివీతీరా ఆస్వాదిస్తేనే తప్ప.. మాటల్లో వర్ణించలేం. అలాంటి ఆనందాల పండుగకు వేళయింది. పిల్లల పండుగ (అనంత బాలోత్సవం-2025) కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడురోజులపాటు జిల్లా కేంద్రంలోని లలితకళాపరిషత్‌లో అనంత బాలోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం సాయంత్రం బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా, సహాయ కార్యదర్శి సావిత్రి పరిశీలించారు. షమీమ్ షఫీవుల్లా మాట్లాడుతూ.. 14, 15, 16 తేదీల్లో నిర్వహించే బాలోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. పిల్లల్లో దాగున్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు వారిలో మానసికోల్లాసం పెంపొందించేందుకు ఈ ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. బాలోత్సవాల్లో పాల్గొనేందుకు పాఠశాలలవారీగా ఈ సారి పెద్దసంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రతిభ కనబరచని వారికి బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం కమిటీ సహాయ కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ... విద్యార్థులు ఆటపాటలు, కళాసాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడంవల్ల వారిలో ఉత్తేజం పెరుగుందన్నారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 10వేల మంది విద్యార్థులు బాలోత్సవాల్లో పాల్గొననున్నారన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు శ్యామలమ్మ, చంద్రిక, రామాంజినమ్మ, అశ్విని పాల్గొన్నారు.

పది ప్రీ ఫైనల్ గణిత పరీక్ష సమయం మార్పు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్ నేపథ్యంలో ఈనెల 15వ తేదీన నిర్వహించే పదో తరగతి గణితం ప్రీ ఫైనల్ పరీక్షల సమయాన్ని మార్పు చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 నుంచి 11.45 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రశ్నపత్రాలను మండల విద్యాశాఖాధికారులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరీక్ష సమయానికి గంట ముందు 7.30 గంటలకు పంపిణీ చేయాలని ఆదేశించారు.

సేవాఘడ్‌లో ఉత్సవాలు ప్రారంభం

తొలిరోజు సంత్ సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు



అలంకరణలో సేవాలాల్ మహారాజ్

గుత్తిరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేర్లోపల్లిలోని బంజారాల పవిత్ర పుణ్యక్షేత్రం సేవాఘడ్‌లో గురువారం 286 జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ స్వామి వారికి వేకువజామున పంచామృతాభిషేకం చేశారు. వివిధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతాజగదాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పూజలు చేశారు. ఉత్సవమూర్తులను సాయంత్రం పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు. స్వామివారికి శుక్రవారం ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేస్తారు. రాత్రికి వివిధ రాష్ట్రాల నుంచి బంజారాలు పెద్దఎత్తున తరలివస్తారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి గుర్రంపై ఊరేగిస్తారు. మాల ధరించిన భక్తులు ఇరుముడి సమర్పిస్తారు. శనివారం మాతాజగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, 101 మంది యువతులతో బోనాలు సమర్పిస్తారు. అత్యంత కీలకమైన మహాబోగ్ కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తారు. దీంతో జయంత్యుత్సవాలు ముగుస్తాయి. కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సభ్యులు జగన్నాథరావు, అశ్వత్థనాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి అతిరుద్ర మహాయజ్ఞం

పుట్టపర్తి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలో శుక్రవారం నుంచి విశ్వశాంతి కోరుతూ అతిరుద్ర మహాయజ్ఞాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం సాయి కుల్వంత్ సభామండపంలో ఏర్పాట్లు చేపట్టారు. 11 హోమ గుండాలను సిద్ధం చేశారు. సత్యసాయి బాబా శత జయంతి మహోత్సవాలు ఈ ఏడాది నవంబరులో జరగనున్నాయి. అందులో భాగంగానే అతిరుద్ర మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. యజ్ఞంలో వంద మందికిపైగా పండితులు పాల్గొననున్నారు. భక్తుల కోసం ప్రశాంతి నిలయంలో ప్రత్యేక షెడ్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పలువురు యజ్ఞంలో పాల్గొనడానికి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. 12 రోజులపాటు యజ్ఞం కొనసాగనుంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

దామోదరం సంజీవయ్య (జయంతి)



ఏపీ మాజీ సీఎం దామోదరం సంజీవయ్య 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో జన్మించారు. మద్రాస్ లా కాలేజీలో డిగ్రీ పట్టా పొందిన ఆయన విద్యార్థిదశ నుంచే స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 38వ యేట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. సంయుక్త మద్రాస్ రాష్ట్రంలో, ఆంధ్రరాష్ట్రంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, కేంద్రంలోనూ పలు పదవులలో కొనసాగారు. కాంగ్రెస్ పార్టీ తొలి దళిత అధ్యక్షుడు కావడం విశేషం. పాలనలో తెలుగుభాష వాడకం అధికం చేయడం, భూ సంస్కరణల అమలు వంటివి ఆయన హయాంలో చేపట్టారు. 1972 మే 7న గుండె పోటుతో కన్నుమూశారు. ఆయన స్మారకార్థం పాటిగడ్డ సమీపాన ఒక ఉద్యానవనాన్ని పెంచి 'సంజీవయ్యపార్క్' పేరు పెట్టారు.

మధుబాల (జయంతి)



దేశ సినీ చరిత్రలో తనదైన ముద్ర వేసిన గొప్ప నటి మధుబాల 1933 ఫిబ్రవరి 14న జన్మించారు. అసలు పేరు ముంతాజ్ జెహాన్ బేగం. 1950 దశకంలో అత్యధిక పారితోషికం అందుకున్న నటీమణి. బాలీవుడ్‌లో రెండు దశాబ్దాలలో 73 సినిమాలలో నటించారు. 'మొఘల్-ఏ-ఆజం'లో అనార్కలి పాత్రతో ఎంతో గుర్తింపు పొందారు. కొన్ని సినిమాలకు నిర్మాతగాను, ప్లేబ్యాక్ సింగర్ కూడా వ్యవహరించారు. 36వ యేట 1969 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

సుష్మాస్వరాజ్ (జయంతి)



దేశంలో ప్రముఖ మహిళా నాయకురాలిగా గుర్తింపు పొందిన సుష్మాస్వరాజ్ 1952 ఫిబ్రవరి 14న హర్యానా రాష్ట్రం అంబాలా ప్రాంతంలో జన్మించారు. బీజేపీలో అగ్రనేతగా పేరొందారు. కేంద్రమంత్రిగా, ఢిల్లీ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. విద్యార్థి సంఘం నాయకురాలిగా రాణించిన ఆమె 1970లో రాజకీయాలలోకి వచ్చారు. ఇందిరాగాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టి 1977లో హర్యానా రాష్ట్ర శాసనసభలోకి ప్రవేశించారు. అదే సంవత్సరంలో కేంద్రంలో ఏర్పాటైన జనతా ప్రభుత్వంలో చోటు దక్కించుకున్నారు. 1996, 98లలో వాజ్‌పేయ్ మంత్రివర్గంలోనూ, 2014 నరేంద్రమోదీ కేబినెట్‌లోను చోటు దక్కింది. 1998లో ఢిల్లీ ముఖ్యమంత్రిగా పని చేశారు. పలు హోదాలలో కొనసాగారు. 2019 ఆగస్టు 6న కన్నుమూశారు. 2020లో మరణానంతర పద్మభూషణ్ ప్రకటించారు.

ప్రేమికుల కోసం ప్రత్యేక రుచులు

బెంగళూరు, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): ప్రేమికుల కోసం పాస్తాస్ట్రీట్ ప్రత్యేక రుచులను పరిచయం చేస్తోంది. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర వ్యాప్తంగా వివిధ రెస్టారెంట్‌లు, పబ్‌లు ప్రత్యేక రాయితీలు, సౌలభ్యాలను పరిచయం చేస్తున్నాయి. దేశంలోనే పేరొందిన బ్రాండ్ పాస్తా స్ట్రీట్ సహకారనగర్‌లోని శాఖ ద్వారా ప్రేమికులకు ఇన్సలాటా ది క్వినోవాకాన్ అవకాడ, సన్‌డ్రైడ్ టమోటో చీజ్ కపిలెట్టీ వంటి పాశ్చాత్య రుచులను అందిస్తున్నట్లు ప్రకటించారు. డెజర్ట్‌తో పాటు పలు వంటకాలు అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. ఆన్‌లైన్ ద్వారాపొందే వారికి రాయితీలు ఉన్నట్లు తెలిపారు.

మా ఆయన ప్రేమాయణంపై చర్యలు తీసుకోండి..!

● ఏసీపీపై భార్య ఫిర్యాదు

బెంగళూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఏసీపీ స్థాయి అధికారులు ఇద్దరి మధ్య ప్రేమాయణం కేసులదాకా వెళ్లింది. నగరంలోని ఏసీపీ అధికారిపై హైగ్రౌండ్స్ పోలీస్‌స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి బాధిత ఏసీపీ భార్య అమృత తరపున న్యాయవాది గ్రీష్మ గురువారం మీడియాతో మాట్లాడారు. ఏసీపీగా వ్యవహరిస్తున్న గోవర్ధన్ 2014లో పెళ్లి చేసుకున్నారని, వారికి 8ఏళ్ల బిడ్డ ఉన్నారన్నారన్నారు. కొంతకాలంగా మహిళా పోలీసు అధికారి (ఏసీపీ)తో సన్నిహితంగా ఉంటున్నారన్నారు. మహిళా అధికారికి తరచూ ఫోన్ చేయడం, మెసేజ్‌లు చేస్తున్నారన్నారు. మహిళా పోలీసుతో ప్రేమాయణంపై భార్య అమృత ప్రశ్నించగా.. దాడి చేశారన్నారు. ఇటీవల వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. వారిద్దరూ పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యారని న్యాయవాది ఆరోపించారు. భార్యను హతమార్చేందుకు కుట్ర జరుగుతోందని సమగ్ర దర్యాప్తు చేయాలని కోరామన్నారు.

ప్రత్యేక సమావేశం

రాయచూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధికి సంబంధించి రాయచూరు మహానగర పాలిక ఆధ్వర్యంలో తొలి సారి గురువారం విస్తృత సమావేశం నిర్వహించారు. మహానగర పాలిక కమిషనర్ జుబీన్ మొహపత్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధ్యక్ష-ఉపాధ్యక్షులు నగరసభ సభ్యులతో పాటు పలువురు నగర ప్రముఖులు, సామాజిక సేవకులు పాల్గొని పలు సూచనలు అందజేశారు. 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి త్వరలోనే బడ్జెట్ సమావేశం జరపనున్న నేపథ్యంలో ప్రజల నుంచి అధికారులు పలు సూచనలు స్వీకరించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాల ఏర్పాటు, డ్రైనేజీల్లో పూడికతీత నగర పరిశుభ్రతకు సంబంధించి పలు సూచనలు అందజేశారు. దీంతో పాటు మహా నగర పాలిక అధ్యక్ష-ఉపాధ్యక్షులు ఇతర ప్రజా ప్రతినిధుల కోసం రూ.50 కోట్లతో ప్రత్యేక సమావేశ మందిరం, చాంబర్లు ఏర్పాటు చేసేలా సూచనలు అందాయి. మహానగర పాలిక ఆధ్వర్యంలో 500 దుకాణాలకు సంబంధించి త్వరలోనే టెండర్లు ఖరారు చేస్తామని ప్రకటించినందున వెంటనే టెండర్లు ఖరారు చేసి ఆదాయం పెంపు పై దృష్టి సారించాలని పలువురు సూచించారు.

ఓల్వో ప్రాజెక్టు విస్తరణకు రూ.1400 కోట్లతో ఒప్పందం



సీఎంతో ఒప్పందంలో ప్రముఖులు

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బస్సు నిర్మాణ సంస్థ ఓల్వో హోస్కోటెలో తన నాల్గో ప్లాంట్ ఏర్పాటుకు అంగీకరించింది. ఇన్వెస్ట్ కర్ణాటకలో రూ.1400 కోట్లతో ఒప్పందం చేసుకున్నారు. ఓల్వో ఇండియా ఎండీ కమల్‌బాలి, ముఖ్యమంత్రి సిద్దరామయ్య సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. ఈమేరకు గురువారం అధికారిక నివాసం కృష్ణలో ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్, శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సెల్వకుమార్‌లు పాల్గొన్నారు. హోస్కోటెలోని కంపెనీ ప్లాంట్‌కు అనుబంధంగా మరో విభాగం ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా నేరుగా 2వేలమందికి ఉద్యోగాలు సాధ్యమని ప్రకటించారు. ఇప్పటికే ఓల్వో సంస్థ రాష్ట్రంలో ధారవాడ, పీణ్యా, హోస్కోటెలలో మూడు ప్లాంట్‌లు కలిగి ఉంది. సదస్సులో దేశ విదేశీ ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు.

ఇస్రోమాజీ ఛైర్మన్ సోమనాథ్ చర్చాగోష్టిలో పాల్గొన్నారు. సదస్సులో గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్, పీఈఎస్ యూనివర్సిటీ ప్రొ-చాన్సెలర్ జవహర్ దొరస్వామి ఇన్వెస్ట్ కర్ణాటక సదస్సులో పాల్గొని పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్, ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్‌లతో చర్చలు జరిపారు. ప్రదర్శనలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

● ఇన్వెస్ట్ కర్ణాటకలో పాల్గొన్న ప్రముఖులు

యూనివర్సిటీలు.. నైపుణ్య కేంద్రాలు కావాలి..

: ఉన్నత విద్యాశాఖమంత్రి సుధాకర్

యూనివర్సిటీలు నైపుణ్యతను నిర్దేశించే కేంద్రాలు కావాలని అప్పుడు పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు సాధ్యమని, పోటీ ప్రపంచంలో నైపుణ్యంతో కూడిన విద్య అవసరమని ఉన్నతవిద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. 30యూనివర్సిటీల ముఖ్యులతో ప్రత్యేక సమావేశం జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యత ఆధారంగా బోధనలు ఉండాలన్నారు. విద్యస్వభావాన్ని మార్చలేమని అయితే పాఠ్యాంశాలలో సవరణలు అవసరమన్నారు. మన యూనివర్సిటీలకు 70శాతం విద్యార్థులు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నారని, క్విన్ సిటీలో డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఎంఎన్‌సి సంస్థల పరిశోధనా విభాగాలు ఏర్పాటు చేస్తాయన్నారు. ఇదే సందర్భంగా 9 యూనివర్సిటీలతో మంత్రి ఒప్పందం చేసుకున్నారు. వాటిలో పీఈఎస్ యూనివర్సిటీతోపాటు కేఎల్ఇ యూనివర్సిటీ వ్యవస్థాపకులు ప్రభాకర్ కోరె తదితరులు పాల్గొన్నారు. విప్రో అజీం ప్రేమ్‌జీ, యాక్, బోస్టన్, ఆర్‌వి, ఏట్రియా యూనివర్సిటీ, నేషనల్ పబ్లిక్‌స్కూల్, అలయెన్స్ యూనివర్సిటీ, ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ మేనేజిమెంట్, శాన్‌ఫ్రాన్సిస్కోలోని వైసెకేప్టెన్ యూనివర్సిటీలతో ఒప్పందం జరిగింది.



ఇన్వెస్ట్ కర్ణాటక సదస్సులో థావర్‌చంద్ గెహ్లాట్

సంస్కృతిని కాపాడుకోవాలి

'ఇతిహాస పరంపర' కార్యక్రమంలో ప్రొఫెసర్ నరసింహన్



సదస్సును ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ నరసింహన్ తదితరులు

బాగేపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా ఉన్న వారసత్వసంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శాసన నిపుణులు, కర్ణాటక ఇతిహాస అకాడమీ బెంగళూరు ప్రొఫెసర్ కేఆర్ నరసింహన్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని జ్ఞానదీప్తి పాఠశాలలో ఏర్పాటైన 'ఇతిహాస పరంపర కాపాడాలి' అనే అంశంపై ఏర్పాటైన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రాచీనదేవాలయాలు, స్మారకాలు మనసంస్కృతికి ఆనవాళ్లుగా ఉన్నాయని వాటిని కాపాడుకుని భావితరాలకు అందించాలన్నారు. చరిత్రకు ఆధారమైన శాసనాలు, శిల్పాలు, నాణేలు, కోట బురుజులు గత వైభవానికి ప్రతీకగా ఉన్నాయని వీటిని కాపాడుకుని యువతకు చరిత్ర గురించి అవగాహన కల్పించాలన్నారు. ఇతిహాస అకాడమీ బాగేపల్లి తాలూకా అధ్యక్షుడు బీఆర్ కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న పురాతన వస్తువులు, శిలాశాసనాలు, తామ్రపత్రాలు, భవనాలు, పురాతన కట్టడాల మన చరిత్రను తెలియచేస్తాయన్నారు. వీటి అవశేషాలు నాశనంకాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాలూకాలో ఇదివరకు 85శాసనాలు వెలుగుచూశాయన్నారు. అప్పుడప్పుడు అప్రకటిత శాసనాలు, శిలా శాసనాలు, వీరగల్లు వంటివి బయటపడుతున్నాయన్నారు. తాలూకాలోని రెడ్డివారిపల్లి, చేకూరులోని చింతతోపులో యుద్ధ శాసనాలు లభించాయన్నారు. తాలూకాలో పలు చోట్ల మన చరిత్రకు సంబంధించిన అవశేషాలు లభిస్తుంటాయన్నారు. తద్వారా మనపూర్వీకులైన రాజులు, చక్రవర్తులు సాధలను తెలుస్తాయన్నారు. సదస్సులో అకాడమీ శాసనాల పరిశోధకులు ధన్‌పాల్, ఏకే నింగప్ప, కేటీ వీరాంజనేయులు, ఏ నంజుండప్ప, శ్రీనాథ్, నారాయణ్, రామయ్య, పీ వెంకటరామ్, చంద్రనాయక్, వెంకటేష్‌బాబు, మంజునాథరెడ్డి, సయ్యద్ సిద్దిక్, జీకే ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హులిబెలె పాలకమండలి ఎన్నిక ఏకగ్రీవం



సహకారసంఘం డైరెక్టర్ల విజయోత్సాహం

బంగారపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హులిబెలె గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం పాలకమండలిలోని డైరెక్టర్ల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముందస్తుగా నిర్ణయించినట్టుగా గురువారం ఎన్నికలు జరిగాయి. వచ్చే ఐదేళ్ల అవధికి కొనసాగనున్నారు. 22మంది నామినేషన్లు సమర్పించగా గ్రామపెద్దల రాజీతో పదిమంది ఉపసంహరించుకున్నారు. ఇలా 12మంది డైరెక్టర్లు ఏకగ్రీవమయ్యారు. హెచ్‌కే నారాయణస్వామి, గోవింద, ఆర్ బలరామ్, ఆర్ గోవిందప్ప, పుట్టరాజు, గోవింద, మునిరాజు, కళావతి, వెంకటేష్, సీనప్ప, రామక్క, వి శిల్పలు ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన బాలకృష్ణప్ప ప్రకటించారు. నూతన డైరెక్టర్లను గ్రామస్తులు ఆత్మీయంగా సత్కరించారు. పీఎల్‌డీబ్యాంకు మాజీ అధ్యక్షుడు, డెయిరీ డైరెక్టర్ హెచ్‌కే నారాయణస్వామి మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో పాలడెయిరీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా టీపీఎంసీ సహకార సంఘం అధ్యక్షుడు వెంకటాచలపతి, పీఎల్‌డీ బ్యాంకు డైరెక్టర్ వీణా వెంకటేశ్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అడవులు.. వన్యప్రాణులకు స్వర్గధామం: రవి చెళ్లగుర్కి



పరిచయ కార్యక్రమంలో రవి చెళ్లగుర్కి, ఉపాధ్యాయులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అడవులు వన్యప్రాణులక స్వర్గధామమని అన్ని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వన్యప్రాణులు, అభయారణ్యాలపై పరిచయ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అటవీ విధ్వంసం కారణంగా వన్యప్రాణుల జనాభా తగ్గిపోతోందన్నారు. కొన్న జంతువులు ఆహారం, ఆశ్రయం కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నాయన్నారు. అది పర్యావరణంలో అసమతుల్యతను సృష్టిస్తుందన్నారు. ఇది మానవులపై ప్రభావం చూపుతుందన్నారు. ఉపాధ్యాయులు విజయ ముంద్రగి బండిపూర్ జాతీయ ఉద్యానవనం నమూనాను తయారు చేసి కర్ణాటకలోని జాతీయ ఉద్యానవనాల గురించి మాట్లాడారు. ఉపాధ్యాయులు దిల్షాద్‌బేగం, చన్నమ్మ, వైశాలి, శ్వేత, ఉమ్మెహాని, శశమ్మ, రామాంజనేయ, గురుప్రసాద్,మీనాక్షి, అనూష పాల్గొన్నారు.

నాసిరకంగా మధ్యాహ్న భోజనం..!

● పురుగులతో కూడిన బియ్యం, కందిపప్పు సరఫరా ● పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రుల ఆందోళన



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు



బియ్యంలో పురుగు



నాసిరకం కందిపప్పు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అందిస్తున్న బీసీఊట (మధ్యాహ్న భోజనం)లో నాణ్యత కొరవడుతోంది. విద్యార్థులకు నాసిరకమైన ఆహార పదార్థాలతో తయారు చేసిన ఆహారాన్ని అందిస్తున్న కారణంగా పిల్లల్లో ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొప్పళ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో పురుగులతో కూడిన బియ్యం, నాసిరకం కందిపప్పు ఉపయోగిస్తున్నట్లు, ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు నిత్యం కోడిగుడ్డు, అన్నం, సాంబారుతో ఆహారం అందిస్తున్నారు. అయితే కొప్పళ జిల్లా ప్రభుత్వ పాఠశాలకు ఆహార పౌరసరఫరా శాఖ గోడౌన్ నుంచి పురుగులతో కూడిన బియ్యం, నాసిరకం కందిపప్పు సరఫరా చేయడం ఆందోళన కలిగిస్తోంది. పాఠశాలలో కూడా ఇదే సరుకులతో ఆహార పదార్థాలు వండి వడ్డిస్తున్నారు. జిల్లా పరిధిలోని కనకగిరి పట్టణంతో పాటు గంగావతి, కొప్పళతో పాటు చాలా పాఠశాలల్లో కొన్ని నెలలుగా నాసిరకం ఆహార పదార్థాలను పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. కొప్పళ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల పిల్లలతో చేరి మొత్తం 2.8 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. జిల్లాలో చాలా చోట్ల పాఠశాలల్లోనే ఆహారాన్ని తయారు చేసి అందిస్తున్నారు. అన్నం తినే సమయంలో అన్నం, సాంబారులో విద్యార్థుల చేతుల్లోకి పురుగులు కనిపిస్తున్నాయని, దీనికంతా కారణంగా నాసిరకం ఆహార పదార్థాల సరఫరానే ప్రధాన కారమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలోని వంటగదులు పరిశుభ్రత లేకపోవడం, బియ్యం, కందిపప్పును సరిగా శుభ్రం చేయకుండా వండుతున్న కారణంగా భోజనంలో పురుగులు కనిపిస్తున్నట్లు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన భోజనం అందించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఎంతైనా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



హెచ్‌టీటీ విమానం వద్ద ఎంపీ తేజస్వీ సూర్య

విమానంలో ఎంపీ సూర్య చక్కర్లు

బెంగళూరు, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): ఏరోఇండియా వైమానిక ప్రదర్శనలలో బెంగళూరు ఎంపీ తేజస్వీసూర్య దేశీయ సాంకేతికతతో నిర్మితమైన హెచ్‌టీటీ-40 శిక్షణా విమానంలో చక్కర్లు కొట్టారు. హెచ్ఏఎల్ తయారు చేసిన విమానంలో ఎంపీ అరగంట పాటు ఆకాశంలో విహరించారు. అనంతరం తేజస్వీ సూర్య మీడియాతో మాట్లాడుతూ హెచ్ఏఎల్ ద్వారా సంపూర్ణంగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన విమానంలో చక్కర్లు కొట్టడాన్ని గర్వంగా భావిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఏఎల్ భారత్ గర్వకారణమన్నారు. నమ్మబెంగళూరు అనేది గర్వంగా ఉందన్నారు. 2012లో యూపీఏ పాలనలో దేశీయ విమానాల తయారీ సంస్థలకు వెనుకబాటు ఏర్పడిందని కానీ 2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక హెచ్ఏఎల్‌కు ఉత్తేజం లభించిందన్నారు. కాగా 2021 ఏరో ఇండియా వైమానిక ప్రదర్శనలలోను ఎంపీ తేజస్వీ సూర్య తేజస్ తేలికపాటి యుద్ధ విమానంలో సంచరించారు.

పర్యాటక రంగ అభివృద్ధికి సహకారం

● ఐఏఎస్ సల్మా



ట్రావెల్‌టూరిజం ఫెయిర్‌లో ఐఏఎస్ సల్మా తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తామని, కీలకమైన ప్రదేశాలను గుర్తించామని పర్యాటకశాఖ సెక్రటరీ సల్మా కె ఫాహిం అభిప్రాయపడ్డారు. పర్యాటకశాఖ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్ర కేవీతో కలసి ప్యాలెస్‌మైదానంలో గురువారం ట్రావెల్ టూరిజం ఫెయిర్ (టీటీఎఫ్) ప్రదర్శనలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సల్మా మాట్లాడుతూ భారత సిలికాన్ వ్యాలీగా బెంగళూరుకు పేరుందని, కార్పొరేట్ ప్రయాణాలతోపాటు వారాంతంలో వివిధ ప్రాంతాల పర్యటనకు యువత, ఉద్యోగులు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆ దిశగా రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి చేయదలిచామన్నారు. ముంబై, ఢిల్లీ, గుజరాత్ తర్వాత బెంగళూరు టూరిజం హబ్ కానుందన్నారు. దక్షిణభారత్‌లో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న టూరిజం మార్కెట్‌తోపాటు విదేశీ విహారయాత్రలకు వెళ్లేవారికి అవకాశాలు మెరుగు చేశామన్నారు. ఎక్స్‌పోలో టూరిజం కార్పొరేషన్‌లు, ట్రావెల్ కంపెనీలు, వివిధ బ్రాండ్‌లు, విమానయానసంస్థలు, ట్రావెల్‌డెస్క్ సంస్థలతోపాటు 150కుపైగా ఎగ్జిబిటర్స్ భాగస్వామ్యులయ్యారు. రానున్న టీటీఎఫ్‌లో నేపాల్ టూరిజం కార్పొరేషన్, గోవా, మేఘాలయ, గుజరాత్, తమిళనాడు కార్పొరేషన్‌లు భాగస్వామ్యం కానున్నాయన్నారు. వ్యాపార సందర్శకులకు టీటీఎఫ్ కంపెనీలతో చర్చించే నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈనెల 15వరకు ఎక్స్‌పో జరగనుంది.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● న్యాయాధికారి బోలా పండిత్



మాట్లాడుతున్న న్యాయాధికారి బోలా పండిత్

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో చట్టాలపై కనీస అవగాహన అవసరమని బెంగళూరు గ్రామీణ జిల్లా న్యాయసేవల ప్రాధికార మెంబర్ సెక్రటరీ, న్యాయాధికారి బోలాపండిత్ అభిప్రాయపడ్డారు. ఆనేకల్ తాలూకా చోడహళ్ళి గ్రామంలో అలయెన్స్ కళాశాల, జిల్లా న్యాయసేవల ప్రాధికార ఆధ్వర్యంలో చట్టాలపై జాగృతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మనిషి పుట్టినప్పటి నుంచి తుదిశ్వాసవరకు చట్టం యొక్క ప్రాధాన్యత ఉందన్నారు. ఈ నేపథ్యంలో చట్టాలపై అవగాహన పెంచేలా లా యూనివర్సిటీలు తగిన చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఇలా చట్టాలపై జాగృతి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చోడహళ్ళి గ్రామస్థుల సందేహాలను నివృత్తి చేశారు. న్యాయవాదులసంఘం తాలూకా అధ్యక్షుడు రమేష్, ఇండ్లవాడి గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు ఆదూరు ప్రకాశ్, బీఈఓ వెంకటేష్, కన్వీనర్ శివణ్ణ, జిల్లా మక్కళ సంరక్షణాధికారి ఆశా, అలయెన్స్ యూనివర్సిటీ బీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో నోడల్ అధికారి తనిఖీలు




వైద్యులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి చంద్రయ్య

ముళబాగిలు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని తాలూకా నోడల్ అధికారి, రామనగర జిల్లా ఏడీసీ చంద్రయ్య గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇక్కడి పరిస్థితులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడి ఐసీయూ కేంద్రం నిర్వహణ సజావుగా లేదని, నిర్లక్ష్యం వీడాలని సున్నితంగా హెచ్చరించారు. పడకలు, బెడ్‌షీట్‌లు గోడౌన్‌లో ఉన్నప్పటికీ, వార్డులలో మాత్రం మంచివి వాడకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదుపాయాలు ఉన్నా వాడుకోకపోతే ఎలాగని సిబ్బందికి సూచించారు. వార్డులలో రోగుల అభిప్రాయాలు ఆలకించారు. ఔషధాల నిల్వలను పరిశీలించారు. శౌచాలయాలలో స్వచ్ఛత పాటించాలని, రోగులకు గుణాత్మక చికిత్సలు అందించాలని సూచించారు. అనంతరం తాలూకాలోని దేవరాయసముద్ర, కోలదేవి, కురుడుమలె ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు.

చీనీ టన్ను రూ.24వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 24,300 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5వేలు, సరాసరి రూ. 12వేలతో అమ్ముడు పోయినట్లు తెలి పారు. మా ర్కెట్‌కు మొత్తం 67 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1614.42	1,588.04
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,232	87
నీటి నిల్వ (టీఎంసీలు)	47.06	9.47

మైలార్ జాతరకు పోటెత్తిన భక్తులు



అలంకరణలో స్వామివారు

కంప్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలోని హడగలి తాలుకాలో పేరుగాంచిన మైలార్ లింగేశ్వరస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు ఎద్దుల బండ్లపై చేరుకుని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడ జరిగే భవిష్యవాణి కోసం భక్తులు వేలల్లో చేరుకుంటారు. జిల్లాలో మైలార్ లింగేశ్వరస్వామి జాతర ఎంతో ప్రాముఖ్యమైనదని, రోజుల తరబడి ఉపవాసాలు ఉంటూ స్వామివారికి మొక్కులు సమర్పించుకుంటారు. ఏటా ఈ జాతర రాష్ట్రంలోనే గుర్తింపు వుండేలా నిర్వహిస్తారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎడ్లబండ్లపై జాతరకు వస్తున్న భక్తులు

విద్యార్థులు ప్రతిభా పోటీల్లో పాల్గొనాలి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న లిమారోజ్

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పిల్లలు ప్రతిభా పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించాలని ప్రభుత్వ కన్నడ మీడియం మోడల్ స్కూల్ హెడ్‌మాస్టర్ లీమా రోజ్ అన్నారు. గురువారం నగరంలోని పార్వతి నగర్ లేఔట్ ప్రభుత్వ కన్నడ మీడియం మోడల్ హయ్యర్ ప్రైమరీ స్కూల్లో రాష్ట్ర బాలభవన్ సొసైటీ, జిల్లాపరిపాలన, పంచాయతీ, మహిళా శిశు అభివృద్ధి శాఖ సహకారంతో నిర్వహించిన చిత్రలేఖన పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పిల్లలందరూ పాఠ్యేతర కార్యకలాపాలతోపాటు పోటీలలో పాల్గొనే ఆసక్తిని చూపాలన్నారు. పిల్లల్లో వివిధ కళలలో ప్రతిభ ఉంటుందని, అలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారానే వారిలోని నైపుణ్యతను బయటకు తీసుకురావచ్చని ఉపాధ్యాయులు శ్వేత అన్నారు. పోటీల్లో 65 మంది పిల్లలు పాల్గొన్నారు. గెలుపొందిన పిల్లలకు మహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు వీణాకుట్టే, శశిరేఖ, షర్మిల, జిల్లాబాల భవన్ సొసైటీ అసిస్టెంట్ మల్లికార్జున, మహిళా సాధికారత యూనిట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ షాజహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

శీతల గిడ్డంగి నిర్మాణానికి అనుమతులు

బళ్లారి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని ఆలదల్లి గ్రామం వద్ద ఎండుమిరప నిల్వ ఉంచేందుకు రూ.11.75 కోట్లతో శీతలగిడ్డంగి నిర్మాణానికి అనుమతులు వచ్చినట్లు ఏపీఎంసీ మార్కెట్ యార్డు సెక్రటరీ నంజుండ స్వామి తెలిపారు. ప్రస్తుతం శీతలగిడ్డంగితో పాటు చుట్టు ప్రహరీ నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు తెలిపారు. ఇక్కడ ఎండుమిరప మార్కెట్ యార్డు పనులు పూర్తి అయి మార్కెట్ యార్డు నిర్వహణలోకి వస్తే ఎంతో మేలు జరుగుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగుల గ్రాంట్‌లో ఐదు శాతం ఉపయోగించాలి

● కమిషనర్ దాస్ సూర్యవంశీ



మాట్లాడుతున్న వికలాంగుల హక్కుల రాష్ట్ర కమిషనర్ దాస్ సూర్యవంశీ, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల కోసం కేటాయించిన 5 శాతం నిధులను అధికారులు పూర్తిగా వినియోగించాలని వికలాంగుల హక్కుల చట్టం అమలు రాష్ట్ర కమిషనర్ దాస్ సూర్యవంశీ అన్నారు. వికలాంగుల హక్కుల చట్టం-2016 అములపై గురువారం నగరంలోని కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియోంలో దివ్యాంగుల, సీనియర్ సిటిజన్ల సాధికారత శాఖ నిర్వహించిన జిల్లాస్థాయి ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దివ్యాంగులు సమాజంలో 21 రకాల వైకల్యాలతో జీవిస్తున్నారన్నారు. అధికారులు వారికి చట్టబద్ధంగా లభించే సౌకర్యాలను అందించాలన్నారు. దివ్యాంగులకు విద్య అనేది వ్యక్తిగత, వృత్తిపరమైన వృద్ధికి తోడ్పడుతుందన్నారు. జిల్లాలోని పాఠశాలల్లో దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు బ్రెయిలీ స్పర్శ రచనను అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని 900 రెసిడెన్షియల్ పాఠశాలల్లో 25 శాతం వైకల్యం ఉన్న పిల్లలకు 10 శాతం సీట్లు రిజర్వేషన్, ఉచిత విద్యను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత పారా ఒలింపిక్స్‌లో దేశం అనేక పతకాలను గెలిచిందన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించడానికి జిల్లాస్థాయిలో క్రీడలను నిర్వహించాలని యువజన సర్వీసులు, క్రీడల శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. జాతీయ వికలాంగుల అభివృద్ధి ఆర్థిక సంస్థ ద్వారా ప్రతి ఏడాది రాష్ట్రానికి రూ.100 కోట్లు గ్రాంట్ తనుకురావచ్చని. దివ్యాంగులకు రూ.50లక్షల వరకు రుణాలు అందించవచ్చని, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ఆమలు చేయవచ్చని ఆయన అన్నారు. ఆర్‌బీఎస్‌కే ఆరోగ్య కార్యక్రమం కింద ముగ్గురు వైద్యుల బృందం ప్రతి పాఠశాలను సందర్శించి 18 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలందరికీ వారి వైకల్యాలను గుర్తించడాకి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ దివ్యాంగులకు నెలవారీ భత్యం, పెన్షన్ పొందడంలో జాప్యం జరిగితే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప. మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్, జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి గోవిందప్ప, జిల్లాస్థాయి శాఖల అధికారులు, జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం కార్మికులు, వికలాంగుల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

పురసభల్లో పురుషులకు అవకాశం ఇవ్వొద్దు

కంప్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పురసభ ప్రాంగణంలో జరిగే సమావేశాల్లో భార్యలు బదులుగా వారి భర్తలు, తల్లిదండ్రులకు బదులుగా వారి కుమారులు సమావేశాల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించవద్దని స్థాయి సమితి మాజీ అధ్యక్షుడు రామన్న కోరారు. బుధవారం పురసభ ముఖ్య అధికారికి ఈ విషయంపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ వార్డులో ఓటర్లచేత ఎన్నికైన అభ్యర్థులకు మాత్రమే సమావేశాల్లో ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. కానీ ఎన్నికైన మహిళా కౌన్సిలర్లు బదులుగా భర్తలు పురసభ ప్రాంగణంలో అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొనడం దారుణమన్నారు. ఇది రాజ్యాంగానికి విరుద్ధంగా చేపట్టడం సరికాదన్నారు. అక్కడ జరుగుతున్న సమావేశంలో ముఖ్య అధికారి అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో పాటు కౌన్సిలర్లు 23 వార్డుల్లో అభివృద్ధి విషయంపై చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకుంటారు. అలాంటి సమావేశాలకు భార్యలకు బదులుగా భర్తలు పాల్గొన్నందుకు అవకాశం కల్పించరాదని కోరారు.

సింధనూరు నగర సభ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవం

రాయచూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు నగరసభకు గురువారం జరిగిన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 35 మంది సభ్యులున్న నగరసభలో గురువారం నిర్వహించిన సభకు 24 మంది హాజరుకాగా మిగితా 11 మంది గైర్హాజరయ్యారు. అధ్యక్ష పదవి కోసం ప్రియాంక విఠల్‌రావ్, ఉపాధ్యక్ష స్థానం కోసం మంజుళ ప్రభురాజ్ ఇద్దరే నామినేషన్ వేయగా, వారినే ఎంపిక చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సింధనూరు సహాయ కమిషనర్ బసవణ్ణప్ప కళశెట్టి ప్రకటించారు. కొత్త అధ్యక్ష-ఉపాధ్యక్షుల నేతృత్వంలోని కౌన్సిల్ పదవీ కాలం మరో 20 నెలల పాటు ఉండనుంది. ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ, తహసీల్దార్ అరుణ్ హెచ్ దేసాయి, నగరసభ కమిషనర్ మంజునాథ పాల్గొన్నారు.

మహారథోత్సవంపై శాంతిసభ

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని మోకా గ్రామంలో 19వ తేదీన మోకా మల్లేశ్వరస్వామి మహారథోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో సర్కిల్ శాంతి సభను నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప, ఎస్ఐ కాళింగ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు గ్రామ ప్రముఖులు, పెద్దలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జాతరను శాంతియుతంగా జరుపుకోవాలని, రోడ్లకి ఇరువైపులా చిరు వ్యాపారులు జాతర అనంతరం దుకాణాలు వేసుకోవాలని, పబ్లిక్ ప్లేసుల్లో కరెంటును కేవీ అధికారుల పర్మిషన్ తీసుకుని వాడుకోవాలన్నారు. జాతర సమయంలో రథం లాగేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పీడీవో వెంకటమ్మ, గ్రామ పంచాయతీ అధ్యక్షులు లక్ష్మి, వెంకటేష్, మాజీ పంచాయతీ అధ్యక్షులు ఫొటో రామన్న, ఆలయ అధ్యక్షుడు పత్తార వెంకటేష్, రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ కాళింగ

కొనసాగుతున్న విలేజ్ అకౌంటెంట్ల నిరసన



సిరిగుప్పలో దీక్షలు చేస్తున్న విలేజ్ అకౌంటెంట్లు

సిరుగుప్ప, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహిస్తోందని ప్రభుత్వ విలేజ్ అకౌంటెంట్ల తాలుకా సంఘం అధ్యక్షుడు విరుపాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణ తహసీల్దార్ కార్యాలయం ఎదుట విలేజ్ అకౌంటెంట్ల ధర్నా నాల్గవ రోజు కొనసాగింది. ఇంతవరకు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దిగిరాకపోవడం తమపై నిర్లక్ష్య వైఖరిని చాటిచెబుతోందన్నారు. మొదటి విడతలో హామీలను నెరవేరుస్తామని చెప్పి ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. రెండవ విడత పోరాటం కొనసాగించామని ఆయన అన్నారు.

రాయచూరు: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పాలనాధికారులుగా పని చేస్తున్న ఉద్యోగులు సిబ్బంది నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. రాష్ట్ర కమిటీ సూచన మేరకు గురువారం జిల్లా కేంద్రం రాయచూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగిన ఉద్యోగులు తమ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య దోరణిని తీవ్రస్థాయిలో ఎండగట్టారు. దీంతో పాటు లింగసుగూరు, దేవదుర్గ తదితర పట్టణాల్లోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఉద్యోగులు దీక్షకు దిగారు.

250 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రుద్రేష్ హెచ్ భండారి

తోరణగల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో 250 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భీమసేన్ సంఘం నాయకులు కోరారు. గురువారం సండూరు తాలూకాల తాళ్లూరులోని అంబేడ్కర్ సభా భవనంలో కర్ణాటక భీమసేన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికా గోష్టిలో సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్రేష్ హెచ్ భండారి మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. తెలంగాణలో 2023లో 125 అడుగులు, ఏపీలో 2024లో 206 అడుగుల విగ్రహాన్ని ఆయా ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి వెనుకబడిన సముదాయాలు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. భారతరత్న అంబేడ్కర్ 250 అడుగులు ఎత్తైన ప్రతిమను బెంగళూరులోని ప్రసిద్ధమైన లాల్‌బాగ్ గార్డెన్లో ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు గత యేడాది నుంచి 30 జిల్లాల అధికారులకు కర్ణాటక భీమసేన సంఘం జిల్లా అధ్యక్షులు, పదాధికారులు, సంఘ సంస్థాపక అధ్యక్షులు శంకర రామలింగయ్య ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ఇతర మంత్రులకు విన్నవించినట్లు తెలిపారు. 2025-26 సంవత్సరం బడ్జెట్ సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై ప్రకటించాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు రుద్రేష్ హెచ్ భండారి, పదాధికారుల మహేష్, నాగరాజు, రాఘవేంద్ర, కనకరాయ పాల్గొన్నారు.

28 నుంచి హంపి ఉత్సవాలు

● కలెక్టర్ ఎంఎస్ దివాకర్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు హంపి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. దివాకర్ తెలిపారు. అంతకు మూడు రోజుల ముందు విజయనగర వైభవ సౌండ్ అండ్ లైట్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. హంపిలో ప్రధాన వేదిక గాయత్రి పీఠం సమీపంలో ఉంటుందని ఆ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అత్యంత ప్రజాదరణ పొందిన సౌండ్ అండ్ లైటన్ షో ఉత్సవాల సమయంలోనేకాక ముగిసిన తర్వాత ఏడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ప్రధాన వేదికకు హంపి ఉత్సవ స్థాపకుడు ఎం.పీ.ప్రకాశ్ పేరు పెట్టాలని నిర్ణయించామన్నారు. మొత్తం నాలుగు వేదికలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రూ.20కోట్ల గ్రాంట్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. పార్కింగ్ కోసం 100 ఎకరాల స్థలాన్ని ఉపయోగిస్తామన్నారు. మూడువేదికలు స్మారక చిహ్నాల సమీపంలో ఉంటాయని తెలిపారు. ప్రజలు ఉత్సవంతోపాటు విజయనగర గత వైభవాన్ని చూడవచ్చన్నారు. బైస్కై హెలికాప్టర్, కుక్కలు, గొర్రెల ప్రదర్శన, రెజ్లింగ్, బండ ఎత్తు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మాతాంగ పర్వత మైదానంలో ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ,ఉద్యానవన శాఖలు ఇక్కడ ఒక ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. హంపి ఉత్సవాన్ని ప్రోత్సహించేందుకు అమెచ్యూర్ బైకర్ల బృందం బెంగళూరు నుంచి హంపి వరకు బైక్ ర్యాలీని నిర్వహిస్తుందన్నారు. 27వ తేదీన హొస్పేట నగరంలో వసంత వైభవ ఊరేగింపుతో అధికారికంగా ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలలిపపారు. అదేరోజు సాయంత్రం హంపిలోని విరూపాక్ష ఆలయ సమీపం తుంగా నది ఒడ్డున అందరినీ మంత్రముగ్ధులను చేసే తుంగాహారతి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఉత్సవానికి హాజరయ్యే సినీ నటులు, జాతీయ, అంతర్జాతీయ కళాకారుల జాబితాను తయారు చేసే ప్రారంభమైనట్లు కలెక్టర్ తెలిపారు.

తొలిరోజు ఉచితబస్సు సౌకర్యం: ఉత్సవానికి వచ్చే ప్రజలకు మొదటి రోజు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి రోజు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 250 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే రెండు రోజులు హొస్పేట్ నుంచి హంపికి ఉచిత బస్సు సర్వీసు ఉంటుందన్నారు. 45బస్సులు నిరంతరం నడుస్తాయన్నారు.

రేపు జ్ఞానసిరి వార్షికోత్సవం



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ శివనాగ్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని గుగ్గరహట్టిలోని శరబేశ్వర్ సంస్థల్లో ఒకటైన జ్ఞానసిరి స్కూల్, కళాశాల జ్ఞానసిరి వార్షికోత్సవాన్ని శనివారం పాటశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ శివనాగ్ తెలిపారు. గురువారం పత్రికాభవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శరబేశ్వర్ విద్యాపీఠాన్ని 1977లో స్థాపించామన్నారు. పేద కుటుంబాల పట్ల దక్షిణామూర్తి దార్శనికత బళ్లారి నగరంలోని గ్రామీణ ప్రాంతమైన గుగ్గరహట్టిలో, అణగారిన పిల్లలకు ఉత్తమ విద్య, ఉద్యోగ కల్పనను అందించేందుకు సంస్థను ప్రారంభించామన్నారు. కర్ణాటక అంతటా ప్రాథమిక, కళాశాలు(సీబీఎస్ఈ), పీయూసీ(ఇంటర్) సహా 36కిపైగా అనుబంధ సంస్థలు ఉన్నాయన్నారు. నర్సింగ్, బీఎడ్ వంటి కోర్సులను ప్రారంభించడం ద్వారా ఇది సమాజానికి సహకారాన్నిఅందిస్తోందన్నారు. సంస్థలో చదివిన వేలాది మంది విద్యార్థులు విదేశాల్లో ఉన్నత పదవుల్లో స్థిరపడ్డారన్నారు. శనివారం సాయంత్రం జ్ఞానసిరి స్కూల్, కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న కార్యక్రమ ప్రారంభోత్సవిఇకి సినీ రచయిత సంగీత దర్శకుడు హంసలేఖ రానున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా నగర ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి, విజయనగరం జిల్లా శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎం.మునిరాజు విచ్చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ చోళరాజు, జానకిరామ్ పాల్గొన్నారు.

ఘనంగా యల్లమ్మదేవి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రారావి యల్లమ్మదేవి జాతర, మహా రథోత్సవం ఘనంగా నిర్వహించారు. సిరుగుప్ప తాలుకా ఆదోని రోడ్డు మార్గంలో రారావి గ్రామంలో వెలసిన యల్లమ్మదేవి జాతర, మహా రథోత్సవం ప్రతి యేడాది జరుగుతుంది. రథోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తుల నడుమ రథాన్ని లాగారు. భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కుబడులు తీర్చుకున్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు విశ్రాంతి అవసరం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు గంగాధర

కంప్లి, ఫిబ్రవరి 13(ఆంధ్ర జ్యోతి): పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు విశ్రాంత జీవనం అవసరమని తహసీల్దార్ శివరాజ్ అన్నారు. పట్టణంలోని సత్యనారాయణ పేట మల్లికార్జున దేవస్థాన కళ్యాణ మండపంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రిటైరైన ఉద్యోగులు తమ నిత్య జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని తమ జీవితాన్ని కొనసాగిస్తారన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా వుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ జీవితం కొనసాగించాలన్నారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర.. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రిటైర్డ్ ఉద్యోగులు భవనం ఏర్పాటుకు స్థలం ఇవ్వాలని కోరారు. ఎస్ఎం నాగరాజు, హేమయ్యస్వామి, చిత్రగార్, డాక్టర్ ప్రకాష్ మౌనేష్, సత్యనారాయణ, పదాధికారులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆటోమొబైల్ దుకాణం దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రాయచూరు, ఫిబ్రవరి 13: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నగరంలోని టిప్పుసుల్తాన్ రోడ్డులో మోతి మస్జీద్ సమీపంలోని ఆటో మొబైల్ దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో రూ.2 లక్షలకు పైగా ఆటో మొబైల్ వస్తువులు కాలిపోయినట్లు యజమాని వాజీద్ తెలిపారు. అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న దుకాణం పక్కనే ఉన్న రెండు మూడు దుకాణాలకు అగ్ని కీలలు వ్యాపించినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదం గురించి తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి వెళ్లి మంటలను ఆర్పారు.

హోసూరు జోన్

చిన్నారి హత్య కేసు నిందితుడికి డబుల్ యావజ్జీవం



మునియప్పన్

హోసూరు(క్రైం) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చిన్నారిని హత్యచేసిన కేసులో నిందితుడు మునియప్పకు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి సంతోష్ డబుల్ యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. హోసూరు శూలగిరి సప్పడి గ్రామానికి చెందిన మునియప్పన్(40) కూలి పనులకు వెళ్తుండేవాడు. అదే ప్రాంతానికి చెందిన వరలక్ష్మితో వివాహేతర సబంధం ఏర్పడింది. వరలక్ష్మికి 6 నెలల బాబు రమేశ్ ఉన్నాడు. వరలక్ష్మి.. మునియప్పన్‌తో మాట్లాడుతూ.. 'బాబు రమేశ్‌కు అచ్చు మీ పోలికలే ఉన్నాయనీ, వీలైనంత త్వరగా నీ భార్యకు విషయం తెలిపి ఆస్తిలో వాటా తీసుకోవాల'ని 2011 సెప్టెంబరు 28న తెలిపింది. దీంతో మునియప్ప షాక్‌కు లోనయ్యాడు. ఆస్తిలో వాటా ఇవ్వాలంటూ భార్యను ఎలా అడగాలని అయోమయపడ్డాడు. ఆరు నెలల పసిబాలుడి పీకపిసికి చంపి మృతదేహాన్ని సప్పడి అటవీ ప్రాంతంలో పడేసి పారిపోయాడు. స్థానికులు పసివాడి మృతదేహాన్ని గుర్తించి, శూలగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మునియప్పన్‌ను అరెస్టు చేశారు. కేసును హోసూరు అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారించారు. న్యాయాధికారి సంతోష్ గురువారం తీర్పు వెలువరించారు. పసివాడిని గొంతు నులిమి చంపిన మునియప్పన్‌కు డబుల్ యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ప్రత్యంగరీ మాతకు పౌర్ణమి పూజలు

హోసూరు ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): హోసూరులో ప్రసిద్ధి చెందిన మహా ప్రత్యంగిరా దేవి ఆలయంలో పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి ఈ ఆలయాన్ని రాహుకేతు శాంతికోసం భక్తులు యజ్ఞం చేస్తారని ఆలయ కమిటీ వారు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఎండుమిర్చి తీసకొచ్చి హోమంలో వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మూలవిరాట్టుకు విశేష అలంకరణలు చేసి మహామంగళారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. తమిళనాడు నుంచే కాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గుజరీ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హోసూరు ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): హోసూరు సున్నపురాయి జీపీలో సంపంగి, సురేశ్‌లకు చెందిన గుజరీ గోడౌన్‌లో గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వీరు ఇదే ప్రాంతంలో 20 ఏళ్లుగా రెండు గోడౌన్లు తీసుకుని వాటిలో పారిశ్రామిక వాడ నుంచి సేకరించిన పాత ప్లాస్టిక్, ఇనుప సామగ్రిని గోడౌన్‌ల్లో ఉంచి గ్రేడింగ్ చేసి విక్రయిస్తుంటారు. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఒక గోడౌన్‌లో మంటలు చెలరేగడంతో స్థానిక ప్రజలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. గెంకణికోట, కృష్ణగిరి, రాయకోట నుంచి మూడు అగ్నిమాపక వాహనాలను తీసుకువచ్చి మంటలను ఆర్పారు. ప్రమాదంలో రూ.2 కోట్లు విలువైన పాత వస్తువులు దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు.